## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల మండలంలోని మునుగాల గ్రామానికి చెందిన పోలీస్ ధర్మా రెడ్డి అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే అబ్రహం‌లు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

### ఘనంగా ఏరువాక పౌర్ణమి



**కేటీదొడ్డి:** మండలంలోని ఉమిత్యాలలోని ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని శనివారం రైతులు ఏరువాక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకులమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో రైతులు ఎద్దులను రంగులతో అందంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### పెద్దదిన్నెలో భగవద్గీత మహాయజ్ఞం



**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో శనివారం మండల సత్సంగ్ ప్రముఖ్ రవీంద్ర స్వామి ఆధ్వర్యంలో భగవద్గీత మహాయజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అర్చకులు నరసింహస్వామి హాజరై వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంపూర్ణ భగవతా పారాయణం చేశారు. అనంతరం భగవద్గీతలో ఉండే జ్ఞానంతో పాటు దానిని అనుసరించేందుకు పాటించాల్సిన వివిధ నియమాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### విద్యుత్‌శాఖ ఏఈకి వినతి

**మానవపాడు:** మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో ఈ నెల 11న శ్రీనివాసులు, మద్దమ్మలకు మారుడు వినేష్(8) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని శనివారం జిల్లా డీసీసీ కార్యదర్శి మహిమద్ సిరాజ్ అహ్మద్, నాయకులు దామోదర్‌రెడ్డిల ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ సత్తార్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్ నాయుడు, గోకారి, కురుమన్న పాల్గొన్నారు.

### ఆవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు

**అలంపూర్:** వనపర్తి జిల్లాలోని పెబ్బేరు సంతలో పశువులను విక్రయించేందుకు తరలిస్తుండగా పుల్లూరు చెక్‌పోస్ట్ వద్ద అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కర్నూల్ పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన సోగుసాయి ఎద్దును స్థానికుడైన మురళీకృష్ణ వాహనంలో కర్నూలు సమీపంలో కల్లూరుకు చెందిన కుర్వ ఆంజనేయులు మూడు ఆవులు, ఒక లేగదూడలను అదే ప్రాంతానికి చెందిన మేకల రవీంద్ర వాహనంలో తరలిస్తుండగా పుల్లూరు చెక్‌పోస్టు వద్ద అధికారులు పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్నారని ఆరా తీయగా బక్రీదు నేపథ్యంలో పెబ్బేరు సంతలో విక్రయించేందుకు తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత



**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల మండలంలోని బుడ్డారెడ్డిపల్లి పాఠశాలకు శనివారం గ్రామస్తుడు కుర్వ జయన్న వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులకు పరిశుభ్రమైన తాగు నీటిని అందించేందుకు తన భార్య కుర్వ తిమ్మమ్మ జ్ఞాపకార్థంగా రూ.15వేల ఆక్వాటెక్ కంపెనీకి చెందిన వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతను సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భరత్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

### 18న వాహనం వేలం

**ఎర్రవల్లిచౌరస్తా:** కోదండాపురం పీఎస్ పరిధిలో అక్రమంగా పట్టుబడ్డ బొలెరో వాహనం విక్రయానికి ఈ నెల 18న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనం 2021వ సంవత్సరంలో ఎక్సైజ్ కేసులో పట్టుబడినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గల వారు ఉదయం 11 గంటలకు కోదండాపురం పీఎస్‌కు చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# ఆపదొస్తే అంబులెన్స్ ఏది?

- ఉమ్మడి మండలానికి 108 కరువు
- అత్యవసరంలో ప్రైవేట్ వాహనాలే దిక్కు
- మండలంలో 58వేల జనాభా
- నిత్యం ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**ఎర్రవల్లిచౌరస్తా:** ఉమ్మడి ఇటిక్యాల మండలంలో వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల వల్ల స్థానికంగా అంబులెన్స్ (108) అందుబాటులో లేకపోవడంతో నిత్యం ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్ కోసం స్థానికులు, పోలీసులు ప్రయత్నించినా, మండలంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో క్షతగాత్రులను తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులలో మండలంలో తక్షణ అవసరం కోసం 108ను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు చాలాసార్లు ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు వినతులు ఇస్తున్నారు. 2005లో అప్పటి ప్రభుత్వం అత్యవసర పరిస్థితుల కోసం ఉమ్మడి రాష్ట్రం వ్యాప్తంగా ప్రతి మండలానికి వైద్య ఆరోగ్యశాఖ 108లను కేటాయించింది. కానీ ఇటిక్యాల మండలానికి అప్పటి నుంచి నేటి వరకు 108 సౌకర్యం అందని ద్రాక్షలా మిగిలిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదం జరిగితే పక్కనున్న మండలాల నుంచి 108 వాహనాలు రావాల్సిన పరిస్థితి ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మండలంలో జనాభా 58వేల పైనే..**

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉండగా, దాదాపుగా 58వేలకు పైగా జనాభా ఉంది. ఇంత జనాభాకు ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో పాటు 9హెల్త్ సబ్ సెంటర్లు ఉన్నాయి. 108 సౌకర్యం మాత్రం స్థానికంగా అందుబాటులో లేదు. ఇక్కడ 44వ జాతీయ రహదారితో పాటు మండల కేంద్రానికి డబుల్ రోడ్డు ఉండటంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదవశాత్తు రోడ్లపై ప్రమాదం సంభవించినా, అనారోగ్యం కారణాలతో అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇక్కడ 108 సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న పెబ్బేరు నుంచి, గద్వాల ఆస్పత్రి నుంచి 108 అంబులెన్స్‌లు వచ్చే లోపే సగానికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారని ప్రజలు వాపోతున్నారు.

**అత్యవసరంలో చేరుకోని అంబులెన్స్‌లు..**

మండలంలో అంబులెన్స్ సదుపాయం లేకపోవడంతో వివిధ ప్రాంతాలలో జరిగిన ప్రమాదాలకు ఇతర ప్రాంతాల నుంచి సకాలంలో అంబులెన్స్‌లు రాకపోవడంతో చాలా మంది ప్రాణాలను కోల్పోయారు. కొండపేట గ్రామానికి చెందిన వ్యక్తి యాక్తాపురం స్టేజీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో ఘటన స్థలంలోనే అరగంట కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. యాక్తాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎర్రవల్లి కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా, సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో అక్కడే ప్రాణాలను కోల్పోయాడు. బీచుపల్లి కూడలిలో తరుచుగా జరుగుతున్న ప్రమాదాల వల్ల సకాలంలో 108 రాకపోవడంతో ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే మండలానికి 108 సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

#### ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



ఇటిక్యాల ఆరోగ్య కేంద్రానికి మొదటి నుంచి అంబులెన్స్ సౌకర్యం లేదు. మండల ప్రజలు అత్యవసర పరిస్థితులలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మాత్రం ఎంతో దారుణంగా తయారైంది. గర్భిణులకు పురిటినొప్పులు మొదలైతే ఆస్పత్రికి తీసుకెళ్లడానికి అందుబాటులో 108 లేదు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది.

– సరభయ్య, ధర్మవరం

#### పీహెచ్‌సీకి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలి



వైద్య ఆరోగ్యశాఖ తక్కువ జనాభా ఉన్న మండల కేంద్రాలకు గతంలో 108 సౌకర్యం కల్పించింది. నియోజకవర్గంలో అధిక జనాభా ఉన్న ఇటిక్యాల ఆరోగ్య కేంద్రానికి 108 సౌకర్యాన్ని కల్పించలేదు. దీని వల్ల ప్రమాదాలు జరిగి, అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి చేర్చేందుకు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మండలానికి 108ను ఏర్పాటు చేయాలి.

– పెద్ద వీరన్న, సాసనూలు

#### ఉన్నతాధికారులకు విన్నవించాం..

మండలంలో 108 లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అనేక సార్లు విన్నవించారు. మండల పీహెచ్‌సీలో 108 సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు గతంలో విన్నవించాం. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 108 సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తాం.

– డాక్టర్ విష్ణు, మండల వైద్యాధికారి, ఇటిక్యాల

## ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి



అలంపూర్‌లో ప్రజా ప్రతినిధులను సత్కరిస్తున్న అధికారులు

**అలంపూర్:** ముందస్తు ప్రణాళికలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామని ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బేగం అధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్, ఎంపీపీ బేగం, ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ఇప్పటి వరకు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికలను చదవి వినిపించారు. శాఖల వారీగా చేపట్టిన పనులపై సభలో చర్చించారు. ప్రస్తుతం గ్రామాల్లో చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లోని సమస్యలు ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారం చూపాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా ప్రతినిధులకు సన్మానం..**

మండల ప్రజా ప్రతినిధులకు ఆయా శాఖల అధికారులు, నాయకులు సత్కరించారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం త్వరలోనే ముగియనుంది. దీంతో మండల సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో జెడ్పీటీసీ శంషాద్ఇస్మాయిల్, ఎంపీటీసీలను ఆయా శాఖల అధికారులు శాలువాతో సన్మానించారు. మండల అభివృద్ధికి కృషి చేసిన వారికి స్థానిక నాయకులు సత్కరించి అభినందించారు. గ్రామ, మండల అభివృద్ధికి సహకరించిన ఆయా శాఖల అధికారులకు, నాయకులకు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**ధరూరు:** మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పెద్ద చింతరేవుల, తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి అలంకరణ, గణపతి పూజ, కళశ పూజ, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు అర్చకులు తెలిపారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయానికి బంగారం వితరణ



**కేటీదొడ్డి:** మండలంలోని వెంకటాపురం గ్రామంలోని కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం ఇటిక్యాల మండలం ఎస్ఐ వెంకటేష్ దంపతులతో కలిసి ఆలయానికి అరతులం బంగారాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



నగదు బహుమతి అందుకున్న విద్యార్థులతో ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, దాత శేషంపల్లి నర్సింహులు

**మల్దకల్:** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, దాత శేషంపల్లి నర్సింహులు విద్యార్థులకు సూచించారు. శనివారం మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన విజయ్‌కృష్ణకు రూ.10వేలు, రెండో బహుమతిగా భానుప్రియ, భారతిలకు రూ.8వేలు, మూడో బహుమతి మౌనిక, వాణిశ్రీ, యాసిన్‌లకు రూ.5వేలు, వివిధ పాఠశాలకు చెందిన మరి కొంత మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఐదేళ్లుగా 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్న దాతను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. మొత్తం విద్యార్థులకు రూ.50వేలకు పైగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నరేష్, స్వామి, రిటైర్డు హెచ్ఎం స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**గద్వాల అర్బన్:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ చేతుల మీదుగా కేక్‌కట్ చేసి డిప్యూటీ సీఎంకు జన్మదిన వేడుకలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ బాబు, ఇసాక్, నరహరిగౌడ్, వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌యాదవ్, సుదర్శన్, శ్రీనివాసులు ఉన్నారు.

### ప్రజాపాలన దరఖాస్తులు సరిచేసుకోండి



ఏర్పాటు చేసిన ఫిర్యాదుల సెల్

**శాంతినగర్:** గతంలో ప్రజాపాలన దరఖాస్తు చేసు కున్నవారు ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలని వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి పట్టణ వాసులకు సూచించారు. వడ్డేపల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన ఫిర్యాదుల పరిష్కార సెల్ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు జరిగి సంక్షేమ పథకాలు అందని వారు కార్యాలయ పనివేళల్లో వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.

### పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**అయిజ:** ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాష మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో యూనిఫాం, షూ, పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. అదేవిధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యను వ్యాపారంగా మార్చారని వాపోయారు. నిబంధనలు ఉల్లంఘించిన విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హలీం పాషా, దినకర్, సునీల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా కోసం భవనాల పరిశీలన



రాజోళిలో భవనం పరిశీలిస్తున్న డీఈఓ ఇందిర

**రాజోళి:** మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ఏర్పాటు కోసం కావాల్సిన భవనాన్ని డీఈఓ ఇందిర శనివారం పరిశీలించారు. మండల కేంద్రంలో పర్యటించిన ఆమె స్థానికంగా ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల, బీసీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. రాజోళి కస్తూర్బా గాంధీ పాఠశాల సరైన భవనం లేని కారణంగా వడ్డేపల్లిలోని కస్తూర్బా పాఠశాలలోనే నడుపుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆమె రాజోళిలో పర్యటించారు. రాజోళి మండలానికి సంబంధించిన పాఠశాలను రాజోళిలోనే నడిపేందుకు అవసరమైన భవనాలను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులను తీసుకొస్తే పరిశీలించిన భవనాల్లో వసతులు సరిపోతాయా లేదా? అనే అంశాలను, తరగతి గదుల ఏర్పాటు తదితర అంశాలను ఆమె అధికారులతో మాట్లాడారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించిన అనంతరం పాఠశాల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రసూనరాణి

**అలంపూర్ రూరల్:** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూనరాణి అన్నారు. మండలంలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఎన్‌డీడీ(నులిపురుగుల నివారణ దినోత్సవం) కార్యక్రమంపై అవగహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివరణ దినోత్సవం సందర్భంగా 0–19 సంవత్సరాల వయసు గల పిల్లలకు అల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు ఇస్తున్నట్లు తెలిపారు. 1 నుంచి 2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మాత్రను ప్రతి ఆరు నెలలకోసారి మింగించాలని, నులిపురుగులు మలమూత్ర విసర్జనలో పడిపోతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందు నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ అక్కమ్మ, నోడల్ అధికారి బాలీశ్వరయ్య శెట్టి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకే ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ



మిట్టదొడ్డిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

**కేటీదొడ్డి:** బడిబాట కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలకే విద్యార్థులను పంపేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యత కల్పించాలని ఎంపీపీ మనోరమ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం సందర్భంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. పత్తి పొలాల్లో పనిచేస్తున్న బడీడు బాలబాలికలందరిని బడిబాట పట్టించేందుకు మండలంలోని ప్రభుత్వ, పోలీస్‌శాఖ, రెవెన్యూ, సిబ్బంది, మండల ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. కాటన్ సీడ్ పత్తి పొలాల్లో కూలీలుగా పని చేయించుకునేందుకు తల్లిదండ్రులకు అడ్వాన్స్‌గా డబ్బులు ఇచ్చే యాజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఎంపీడీఓ రాములు నాయక్, ఎంఈఓ సురేష్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

**మిట్టదొడ్డిలో బడిబాట ర్యాలీ**

**గట్టు:** మండలంలోని మిట్టదొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ బడిబాటను నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి, అంగన్‌వాడీ టీచర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంతో పాటుగా చిన్నారులకు ఆట, పాటలతో చదువుపై ఆసక్తిని పెంపొందించడం జరుగుతుందన్నారు. 3 ఏళ్ల పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. ని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో చదువుపై దృష్టిని మళ్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళావతి, నాగేశ్వరి, ఆయాలు పాల్గొన్నారు.

## కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న నర్సింహ

**ధరూరు:** కార్మికవర్గానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నర్సింహ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో హమాలీ సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటం చేసి న్యాయపరమైన హక్కులు, డిమాండ్లను సాధించుకోవాలన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కావాలంటే ఐక్యతగా ముందుకు సాగాలన్నారు. అసంఘటిత కార్మికవర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింహులు, దేవదాసు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి



బీటీని తొలగించి గుంతలుగా మార్చిన రోడ్డు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు

**మానవపాడు:** మానవపాడు నుంచి అలంపూర్ చౌరస్తాకు చెన్నిపాడు మీదుగా వెళ్లే ప్రధాన రహదారి, చెన్నిపాడు నుంచి పెద్దపోతులపాడు మధ్యలో రూ.2కోట్ల నిధులతో వంతెన నిర్మాణం పనులు సాగిస్తున్నారు. వంతెన పక్కన పక్కన తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుపై బురద వల్ల వాహనదారులు అవస్థలు పడుతున్నట్లు వరుస కథనాలు 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమయ్యాయి. తాత్కాలిక రోడ్డు మరమ్మతు కోసం అధికారులు పెద్దపోతులపాడు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న బీటీ రోడ్డును తొలగించి తాత్కాలిక దారిలో వేశారు. అసలే రోడ్డు సరిగా లేదని ఇబ్బందులు పడుతుంటే, బాగున్న రోడ్డును తొలగించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉన్న రోడ్డును తొలగించి మరో రోడ్డును నిర్మిస్తున్నట్లుంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.